క్లుప్తంగా

హుజూరాబాద్‌లో స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలి



హుజూరాబాద్: హుజూరాబాద్ కేంద్రంగా అంబేద్కర్ స్టడీ సెంటర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల విజయ్ కుమార్ శుక్రవారం ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలో స్టడీ సెంటర్ ఉండటం మూలంగా మండలాల నుంచి వెళ్లే యువతకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని హుజూరాబాద్ కేంద్రంగా స్టడీ సెంటర్ ఉంటే ఇబ్బందులు తొలగుతాయన్నారు. ఈ మేరకు స్టడీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో మల్లారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ధాన్యం దళారులకు అమ్మొద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ధాన్యం డబ్బులు జాప్యం లేకుండా వెంటనే రైతుల ఖాతాల్లో వేయడానికి జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు, తదితరులు ఉన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌కుమార్

హుజూరాబాద్: మండలంలోని శాలపల్లి ఇందిరానగర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొడిగుటి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కూలీలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు భగవద్గీత ప్రవచనం



జమ్మికుంట: పట్టణంలోని భగవద్గీత జ్ఞాన మందిరంలో చిత్తూరు జిల్లా ఏర్పేడు వ్యాసాశ్రమం పీఠాధిపతులు శ్రీపరిపూర్ణానందస్వామి సమక్షంలో శని, ఆదివారం గీతోపదేశం కార్యక్రమం ఉంటుందని భగవద్గీత మందిరం ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం, ఆదివారం ఉదయం ప్రవచనం ఉంటుందని పట్టణ ప్రజలు, భక్త సమాజం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రూ.49,760 స్వాధీనం

వీణవంక: మండలంలోని కనపర్తి గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో శుక్రవారం సాయంత్రం పోలీసులు దాడులు చేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 పేకాట ఆడుతుండగా ఎస్సై తోట తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.49,760 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. పేకాటతో కుటుంబాలను రోడ్డు పాలు చేసుకోవద్దని, లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల, వాగొడ్డురామన్నపల్లి గ్రామాల శివారులో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో మర్రిపెల్లి గూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుమతి లేకుండా రూ.9,700 విలువైన మద్యం, అలాగే వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి రూ.5,020 మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని, ఇరువురిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. అక్రమంగా మద్యం సరఫరా చేసేవారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం

కరీంనగర్ కార్పొరేషన్: లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, వారిని ఓడిస్తారన్నారు.

ప్రైవేట్ వ్యాపారులకు అమ్మేదెలే!

- మొదలైన యాసంగి వరి కోతలు
- దళారుల వైపు రైతుల విముఖత
- కేంద్రాల వద్ద పేరుకుపోతున్న ధాన్యం రాశులు
- క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఆశలో అన్నదాతలు



కురిక్యాలలో ఆరబోసిన ధాన్యం

గంగాధర: ఆరుగాలం శ్రమించి, కష్టనష్టాలకు ఓర్చి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవడానికి రైతులకు పడిగాపులు తప్పడం లేదు. వారం రోజుల క్రితం నుంచి మండలంలో వరి కోతలు మొదలయ్యాయి. కోసిన ధాన్యం ఆరబెట్టడానికి పొలాల వద్ద కల్లాలు లేక ఇండ్ల వద్ద స్థలం కరువై కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ చదును చేసి ఆరబోస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలతో నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకు కోతలు ముమ్మరమయ్యే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని గంగాధర, కురిక్యాల సహకార సంఘాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఐకేపీ ఆధ్వర్యంలో కేంద్రాలను నిర్వహిస్తారు. యాసంగి ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. కానీ మండలంలో ఎక్కడ ప్రారంభించలేదు.

తగ్గిన సాగు విస్తీర్ణం

మండలంలో నారాయణపూర్ రిజర్వాయర్‌తో పాటు వరద కాలువ ద్వారా చెరువులు, కుంటలు నిండటంతో భూగర్భ జలాలు పెరిగాయి. నాలుగైదేళ్లుగా వరిసాగు విస్తీర్ణం పెరిగింది. గతంలో రబీలో మూడు, నాలుగువేల ఎకరాలు దాటని వరిసాగు ప్రస్తుతం ఐదింతలు పెరిగింది. ప్రస్తుతం చెరువు, కుంటలతో పాటు వరద కాలువసైతం ఎండిపోయింది. దీంతో భూగర్భ జలాలు తగ్గిపోయి సాగు విస్తీర్ణం తగ్గింది. గతంలో 20 వేల ఎకరాలకు మించి రైతులు వరి సాగు చేస్తే ఇప్పుడు 18,400 ఎకరాల్లో సాగు చేయగా సాగునీటి సమస్యతో కొన్ని పొలాలు ఎండి పోయాయి.

కొనుగోలు కేంద్రాలకే మొగ్గు

గత యాసంగిలో మద్దతు ధర పెంచినప్పటికీ రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించడానికి మొగ్గు చూపారు. క్వింటాల్‌కు రూ.ఐదువందల బోనస్ చెల్లిస్తామని రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇవ్వటంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవడానికి ఎదురుచూస్తున్నారు. గతంలో క్వింటాల్‌కు మూడు నుంచి నాలుగు వందల వరకు ఖర్చయిందని, తూకంలో కోతలు విధించారని, ధాన్యం డబ్బులకు నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో తూకంలో కోతలు ఉండవనే ధీమాతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలిస్తున్నారు. గతంలో క్వింటాల్‌కు రూ.2,060 ఉండగా ప్రస్తుతం ప్రభుత్వం గ్రేడ్ -1 రూ.2,203, సాధారణం రూ.2,183 ప్రకటించింది.

పడిగాపులు కాస్తున్నారు



కోతలు కోసి ధాన్యాన్ని కేంద్రాల వద్ద పోసి రైతులు పడిగాపులు కాస్తున్నారు. కేంద్రాలు ప్రారంభించిన తర్వాత తాలు, తడి అంటూ జాప్యం చేస్తారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వంకలు పెట్టకుండా తూకం వేయాలి.

– మేడిశెట్టి నవీన్‌రావు, మాజీ సర్పంచ్, కురిక్యాల

త్వరలోనే కొనుగోళ్లు



మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం మద్దతు ధరను గ్రేడ్ -1 రూ.2,203, సాధారణం రూ.2,183 పెంచింది.

– రాజు, వ్యవసాయ అధికారి

కల నెరవేరుతున్న వేళ

కనపర్తిలో నేటి నుంచి ధ్వజ ప్రతిష్ఠ ఉత్సవం



ముస్తాబైన శివాలయం

వీణవంక: ఆ ఊరి కల నెరవేరుతుంది.. వందల ఏళ్ల చరిత్ర కలిగిన శివాలయం శిథిలావస్థలో ఉండగా మహాకాళ వంశస్థుల చొరవతో నేడు పునరుద్ధరణకు నోచుకుంది. ఎంతగానో ఎదురుచుస్తున్న ఆ ఊరి గ్రామస్తుల కల శనివారంతో తీరిపోనుంది. మండలంలోని కనపర్తి గ్రామంలో అతిపురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోగా అదే గ్రామానికి చెందిన మహాకాళ వంశస్థులు విరాళాలు సేకరించి గుడిని బాగుచేశారు. ప్రముఖ వేదపండితులు శ్రీగూడ జగదీశ్వర శర్మ ఆధ్వర్యంలో 13,14,15వ తేదీల్లో ధ్వజ ప్రతిష్ఠాపన, శివకళ్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. అదేవిధంగా మల్లన్నగుడి ధ్వజ ప్రతిష్ఠాపన, భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి స్థల మార్పిడి చేపట్టనున్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలు, కలశం ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 15న మహాఅన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని జగదీశ్వరశర్మ కోరారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లిలోని శ్రీకోదండ రామాలయంలో బ్రహ్మోత్సవాలను శనివారం నుంచి ఈనెల 17వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు విశ్వక్సేన విధి, వాసుదేవ పుణ్యాహవచనం, అంకురారోపణం, రక్షబంధనం, నంద దీపస్థాపన, బడవాచనం, అగ్నిప్రతిష్ఠ, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు ధ్వజరోహణం, గరుడబలి, నిత్యహోమం, బలిహరణ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తారు. 14న ఉదయం 9 గంటలకు విశ్వక్సేన విధి, చతుస్థానార్చన వీధి, అరిష్టాక్షయహోమం, బలిహరణ, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు నిత్యహోమం, నిత్యబలిహరణ, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. 15న ఉదయం 9గంటలకు విశ్వక్సేన వీధి, నిత్యహోమం, బలిహరణ, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 6గంటలకు వైకుంఠ పార్షకహోమం, నిత్యబలిహరణ, తీర్థప్రసాద వితరణ, 16న ఉదయం 9 గంటలకు విశ్వక్సేన వీధి, సుదర్శన పెరుమాళ్ హోమం, నిత్యబలిహరణ, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 6గంటలకు కోదండ రామస్వామి మూలమంత్ర హరణం, నిత్య బలిహరణ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తారు. 17న ఉదయం 11.55గంటలకు శ్రీకోదండ రామస్వామి కల్యాణం, సాయంత్రం 6గంటలకు పూర్ణాహుతి, సహస్ర దీపాలంకరణ, పుష్పయాగం, నాగవెల్లి, ఏకాంతసేవ, ధ్వజవరోహణం, గ్రామబలి, కర్తలకు మంగళశాసనములు కార్యక్రమాలను నిర్వహిస్తారని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కమిటీ సభ్యులు కోరారు.

'ఓర్వలేకే పొన్నంపై విమర్శలు'

కరీంనగర్‌కార్పొరేషన్: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పొన్నంపై బీజేపీ నాయకురాలు రాణిరుద్రమదేవి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి రుద్రమదేవికి లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంపీగా పార్లమెంట్‌లో పోరాటం చేసిన ఘనత పొన్నం ప్రభాకర్ సొంతమన్నారు. ఎంపీ బండి సంజయ్ రూ.12 వేల కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు చెబుతున్నారని, ధైర్యం ఉంటే అభివృద్ధిపై చర్చకు రావాలని అన్నారు. ఎంపీగా ఉన్న సమయంలో పొన్నం ప్రభాకర్ చేసిన అభివృద్ధి పనులు ఇప్పటికీ సజీవంగా దర్శనమిస్తున్నాయని తెలిపారు.

తీరనున్న తాగునీటి సమస్య

- నియోజకవర్గానికి రూ.కోటి మంజూరు
- ముమ్మరంగా కొనసాగుతున్న పైపులైన్ పనులు
- ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చేయడమే లక్ష్యం



శంషాబాద్‌లో పైపులైన్ నిర్మాణ పనులు

మానకొండూర్: వేసవిలో ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పైపులైన్ నిర్మాణాలు, అవసరమైన చోట చేతిపంపులు, నూతనంగా గేటువాల్వ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గానికి కోటిరూపాయలు మంజూరు కాగా మండలానికి రూ. 30 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి.

పైపులైన్ నిర్మాణాలు లేక ఇబ్బందులు

ఏటా ఆయా గ్రామాల్లో నూతన ఇళ్ల నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. గ్రామ పంచాయతీలు వాటికి మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉండగా నిధుల లేమితో తాగునీరు అందించేందుకు పైపులైన్ నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతంలోని నల్లా వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి. అయితే ఇటీవల ప్రభుత్వం తాగునీటికి నిధులు కేటాయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల గుర్తింపు

నూతన పైపులైన్లు, గేటువాల్వ్, చేతిపంపులు ఎక్కడెక్కడ, ఏ గ్రామాల్లో వేయాలో ఇప్పటికే అధికారులు గుర్తించారు. పైపులైన్ నిర్మాణ పనులు ఇప్పటికే పలు గ్రామాల్లో పూర్తయ్యాయి. మానకొండూర్ మండలంలోని వెల్ది, అన్నారంకు రూ.మూడు లక్షల చొప్పున, చెంజర్ల, పచ్చునూర్ రూ. నాలుగు లక్షలు, శంషాబాద్ రూ. రెండు లక్షలు, తోటకుంటపల్లి రూ.తొమ్మిది లక్షలు, లక్ష్మీపూర్‌కు రూ. ఆరులక్షలు పీడబ్ల్యూఎస్ కింద నిధులు మంజూరు కాగా శంషాబాద్, పచ్చునూర్‌లో పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగితా చోట్ల పనులు కొనసాగుతున్నాయి. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు పైపులైన్ నిర్మాణాలు చేపట్టుతుండటంతో ఇప్పటి వరకూ పైపులైన్ నిర్మాణాలు లేక అవస్థలు పడుతున్న స్థానిక కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయితే గ్రామాల్లో తాగునీటి సమస్యకు చెక్ పడినట్లేనని అధికారులు భావిస్తున్నారు.

'కేంద్రం కరీంనగర్‌కు చేసిందేమీలేదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

విద్యానగర్(కరీంనగర్): కేంద్రానికి పన్నుల రూపంలో కరీంనగర్ నియోజక వర్గ ప్రజలు రూ.48,000 కోట్లు చెల్లిస్తే కేంద్రం కరీంనగర్‌కు చేసింది ఏమిలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, డీసీసీ బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీవీ యాంకర్‌గా సమాజానికి పరిచయమైన రాణీ రుద్రమకు రాజకీయాలపై అవగాహన లేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం లాంటిదని ఆయన చేసిన అభివృద్ధిని నియోజక వర్గంలో ఎవరిని అడిగినా చెప్పుతారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు విషయంలో ఆయన పోరాటం గురించి నాటి ప్రతిపక్ష నేతలు సైతం కొనియాడిన సందర్భాలు ఉన్నాయన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తమ పార్టీ అభ్యర్థి ఎంపిక అధిష్ఠానం చూసుకుంటుందని, అభ్యర్థి ఎవరైనా కరీంనగర్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రామిడి రాజిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే. సిరాజ్ హుస్సేన్, నాయకులు సిరికొండ శివప్రసాద్, కనకరెడ్డి, హైమద్ అలీ, చింతల ఎల్లా రెడ్డి, జూపాక సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

- **రిటైర్‌మెంట్ వయస్సుపై స్పష్టతివ్వాలి**

కరీంనగర్: ఉద్యోగుల వయస్సు 61 ఏళ్లు లేదా 33 ఏళ్ల సర్వీసు పూర్తయితే రిటైర్‌మెంట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కొన్ని పత్రిలకు, టీవీ చానల్స్‌లో వైరల్ అవుతున్న కథనాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎఫ్ జావెద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటువంటి కథనాలను ప్రచారంలో పెట్టి ఉద్యోగులను గందరగోళంలోకి నెట్టడం సరైంది కాదన్నారు. సర్వీసును 33 ఏళ్లకు పరిమితం చేయటం సమంజసం కాదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంశంపై వివరణ ఇవ్వాలని కోరారు.

- **హరీశ్‌రావుకు చిన జీయర్‌స్వామి ఆశీస్సులు**

కరీంనగర్: నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీరామాయణ ప్రవచనాల కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శుక్రవారం హాజరై చిన జీయర్‌స్వామి ఆశీస్సులు అందుకున్నారు. హరీశ్‌రావు వెంట కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, తదితరులున్నారు.

విద్యుత్ సరఫరా బంద్



తిమ్మాపూర్: మండలంలోని అల్గునూరు ట్రాన్స్‌కో పరిధిలోని తిమ్మాపూర్, మహాత్మానగర్, అల్గునూరు, ఎల్ఎండీ కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటరమణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, 33కేవీ మెయింటినెన్స్‌లో భాగంగా అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు. శుక్రవారం సైతం సుమారు నాలుగు గంటల వరకు అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈవిషయమై అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వేసవిలో మధ్యాహ్నం వేళ విద్యుత్ సరఫరా నిలిపివేస్తే చాలా ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు.

అబాదిజమ్మికుంట, మాచనపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో..

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని జమ్మికుంట టౌన్ విద్యుత్ శాఖ ఏఈ సురేశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గాంధీచౌక్, సివిల్ హాస్పిటల్, డిగ్రీ కళాశాల, కృష్ణాకాలనీ, ఎంప్లాయీస్‌కాలనీ, హరితనగర్, కొండూరు కాంప్లెక్స్, శాలవాడ, కటికవాడ, పాత కూరగాయల మార్కెట్‌లో ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు, మాచనపల్లి సబ్ స్టేషన్ పరిధిలో సిటికేబుల్ లైన్, యాక్సిస్ బ్యాంక్ ఏరియా, ఓల్డ్ మార్కెట్ ఏరియా, అంబేద్కర్ కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీ, మోత్కులగూడెం ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వెన్కెపల్లి, ఆకునూర్ సబ్ స్టేషన్ల పరిధిలో..

సైదాపూర్: మండలంలోని వెన్కెపల్లి, ఆకునూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు పనులు జరుగుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని శుక్రవారం ఏఈ ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు. ఆకునూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, వెన్కెపల్లి సబ్ స్టేషన్ పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



నియామకపత్రం అందిస్తున్న గంగిశెట్టి రాజు

నియామకం

హుజూరాబాద్: బీజేపీ హుజూరాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన తూర్పాటి రాజును నియమించినట్లు పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కన్వీనర్, పట్టణ ఇన్‌చార్జి, పట్టణాధ్యక్షుడికి తూర్పాటి రాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

స్థానికులకు ఉపాధి కరువు

జమ్మికుంట: ఇతర రాష్ట్రాలకు చెందిన వర్తక, వాణిజ్య, వ్యాపారాలతో స్థానిక యువతకు ఉపాధి దొరకడం లేదని సీపీఎం జోన్ కమిటీ సభ్యులు చెల్పూరి రాములు శుక్రవారం ఆరోపించారు. స్థానికేతరులు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా అమ్మకాలు సాగిస్తూ స్థానిక వ్యాపారులకు నష్టం కలిగిస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా దుకాణాలు ఏర్పాటు చేసి సిండికేటుగా వ్యాపారం చేస్తున్నారని అన్నారు. దుకాణాల్లో స్థానికులను కాకుండా ఇతర రాష్ట్రాల వారికి పని కల్పిస్తుండంతో యువత ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని మండిపడ్డారు. స్థానికేతరుల దుకాణాలను లేబర్ ఆఫీసర్, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్, ఉన్నతాధికారులు తనిఖీలు చేయాలన్నారు. స్థానికులకు ఉపాధి లభించని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగులతో ఆందోళన, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు

కాంగ్రెస్‌లో చేరిక

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. మండలంలోని సింగపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అదే విధంగా పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ కొయ్యడ శ్రీదేవి, కమలాకర్ గౌడ్ సైతం కాంగ్రెస్‌లో చేరారు.

రాముడు లోకానికి ఆదర్శప్రాయుడు

కరీంనగర్‌కల్చరల్: రాముడు మానవ లోకానికి ఆదర్శ ప్రాయుడని కాలమిస్టు, రచయిత డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శివాజీనగర్‌లో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన రామోత్సవం కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరై రాముడు, భరతమాత చిత్రపటాల ఎదుట జ్యోతిప్రకాశనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాముడు తన జీవన విధానం ద్వారా ఎన్నో సామాజిక, రాజకీయ, నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక మూల్యాలను అందించారని అన్నారు. అందుకే ఆయన కథ రామాయణం లోకం ఉన్నంత కాలం ఉంటుందని తెలిపారు. ఈసందర్భంగా రామాయణాన్ని చదవాలని, వినాలని అందులోని లోతైన విలువైన అంశాలను గ్రహించి ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎనగంటి మధుసూదన్‌రావు, ప్రాంత సేవా ప్రముక్ కోమళ్ల రాజేందర్‌రెడ్డి, జిల్లా సేవా ప్రముఖ్ బొమ్మకటి కిషన్, జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, నగర సహకార్యదర్శి తోట రాజనేందర్, తోట రాజేందర్, మెండె లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీని మూడోసారి ప్రధాన మంత్రిని చేయాలి



మాట్లాడుతున్న రవీందర్ రెడ్డి, బాల్‌రెడ్డి

కరీంనగర్ టౌన్: దేశాన్ని విశ్వ గురువుగా మార్చేందుకు కృషి చేస్తున్న నరేంద్ర మోదీని మూడోసారి ప్రధాని చేసేందుకు బీజేపీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్ 18వ డివిజన్ రేకుర్తిలో నిర్వహించిన బూత్ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడారు. బూత్‌స్థాయిలో బూత్ అధ్యక్షులు ఇంటింటికీ వెళ్లి మోదీ చేపట్టి సంక్షేమ పథకాల గురించి వివరించాలని సూచించారు. ప్రపంచంలో భారతదేశాన్ని మూడో బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగే విధంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. కమలం పువ్వుపై ఓటు వేసి బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైపాల్ రెడ్డి, నాంపల్లి శంకర్, దుర్గం మోహన్, గంట్ల నరసింహారెడ్డి, కీచర విష్ణు ప్రసాద్‌రావు, గోదారి నరేశ్, లక్ష్మీరాజం, రజిత తదితరులు పాల్గొన్నారు.